క్లుప్తంగా

వైఎస్సార్ సంక్షేమ పాలన ఆదర్శనీయం



మంగళగిరి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి చెప్పారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి నగర పరిధిలోని నిడమర్రు, పెదవడ్లపూడిలలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాదె సుబ్బారెడ్డి, కొల్లి శేషిరెడ్డి, గాదె సాగర్‌రెడ్డి, తాడిబోయిన వెంకటేశ్వరరావు, బొక్కా అగస్టీన్, నూతలపాటి ఇజ్రాయిల్, దూరు బాబురావు, కొడవత్ మణికంఠ, సద్దాం హుస్సేన్, దగ్గుపాటి సుహమ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు శ్వేత చెప్పారు. మండల కేంద్రంలోని సచివాలయం -3 పరిధిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 87 మందికి వైద్యురాలు శ్వేత వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంచినీరు ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా నాలుగు రోజులకోమారు శుభ్రంగా కడుగుకోవాలని చెప్పారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు కలిగించే దోమలు లార్వాను మంచినీరు నిలువ ఉండే ప్రదేశాల్లో ఉంచుతాయని తెలిపారు. అందువల్ల ఆప్రదేశాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఫ్రైడే-డ్రైడేలో భాగంగా ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వచ్చి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉండే పదార్థాలు ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన, ఏఎన్ఎం భారతీజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: రజకుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11వ తేదీన గుంటూరులో నిర్వహించ తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రపదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లిలోని చిట్యాల ఐలమ్మ రజక సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన మహాసభల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కార్యాక్రమానికి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా వచ్చారు. రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం చేయాలని, ఆదరణ పథకం ద్వారా పరికరాలు అందజేయాలని, 50 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి నిధులు కేటాయించాలని కోరారు. రజక వృత్తిదారుల సంఘం మంగళగిరి తాడేపల్లి నగర కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 11న గుంటూరు బ్రాడీపేట, 6వ లైన్‌లో యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరుగనున్న మహాసభకు రజక వృత్తిదారులు, ఉద్యోగ, కార్మికులందరూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోర్తాట సుబ్బారావు తుమ్మపూడి శివయ్య, సర్వేపల్లి శియ్య, మందూరు బాబూరావు, మాచవరం నరసింహారావు, ఒడుగు రాము తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: బహిరంగంగా పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పాండురంగపేటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,900 స్వాధీనం చేసుకున్నారు.



తుళ్లూరు పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న ముంపు బాధితులు



మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో అల్పాహారం అందజేస్తున్న దృశ్యం



మంగళగిరిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

జల జీవన వ్యథ

● టిడ్కో ఇళ్లను వదలని వరద ● నాలుగు రోజులుగా నీటిలోనే జీవనం ● అరకొర ఆహార పొట్లాల పంపిణీతో సరి! ● పట్టించుకోని అధికారులు

తాడేపల్లిరూరల్: వరద ముంపు ఇంకా వీడలేదు. నీళ్లలోనే కష్టాల జనజీవనం సాగుతోంది. ఫలితంగా బాధితులు అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలువురు సహృదయులు వారిని ఆదుకుంటున్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం, కృష్ణాయపాలెం మధ్య పెనుమాక పరిధిలో ఉన్న టిడ్కో నివాస సముదాయాలు ఇంకా నీటి ముంపులోనే ఉన్నాయి. ఫలితంగా పేదలు అవస్థలు పడుతున్నారు. యర్రబాలెం పంట పొలాల్లో నుంచి మరో పక్క కొండవీటి వాగు నుంచి వచ్చిన వరద నీరు టిడ్కో నివాసాలను ముంచేసింది. నిన్నటి వరకు మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. ప్లాట్లలోకి నీరు రాకపోవడంతో పేదలు అక్కడే నివాసమున్నారు. కార్పొరేషన్ అధికారులు అందించే అరకొర ఆహారాన్ని అందుకుంటున్నారు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సుమారు 1,000 మంది నివాసముంటున్నారని, కొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లినట్లు చెబుతున్నారు. మరో రెండు రోజులపాటు వరద ప్రభావం ఇలాగే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



టిడ్కో నివాసాల మధ్య పారుతున్న వరదనీరు

నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాల వల్ల చెన్నకేశవ్ నగర్ నీటమునిగింది. బాధితులను సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు ఇతర నాయకులతో కలసి మంగళవారం పరామర్శించారు. స్థానికులు నాయకులకు తమ కష్టాలు వివరించారు. రాత్రుళ్లు పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు 10 కేజీల బియ్యం, నూనె, చింతపండు నిత్యావసర సరుకులను ప్రభుత్వం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయులు జి.శ్రీనివాసరావు, మల్లేశ్వరి, శివకుమారి, తిరుపతమ్మ, లక్ష్మి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆపన్నహస్తం

తాడికొండ: వరద బాధిత ప్రాంతాల్లోని కుటుంబాలకు తుళ్ళూరుకు చెందిన మూల్పూరి నరేష్ 3 రోజులుగా ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. హరిశ్చంద్రపురం, రాయపూడి, తుళ్ళూరు వడ్డెర కాలనీల్లోని వరద బాధితులకు తనవంతు సాయంగా మూడు రోజులుగా ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు.



నీట మునిగిన పత్తి పొలాలు



దుగ్గిరాల చెన్నకేశవ నగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా



తాడేపల్లి రూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో నాలుగు రోజుల నుంచి కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా కావడంలేదు. స్థానిక నాయకులు మంగళవారం వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో కార్పొరేషన్ వారు నీటిని సరఫరా చేసేదాకా తాగునీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. మంగళవారం ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు.

పత్తి పొలాలను పరిశీలించిన లాంఫాం శాస్త్రవేత్తలు

తాడికొండ: కొండవీటి వాగు ముంపునకు గురైన పత్తి పొలాలను లాం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. తాడికొండ, బడేపురం, పెదపరిమి గ్రామాల్లో పర్యటించిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్ గోపాల స్వామి, డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మి, డాక్టర్ ఉషారాణి నీట మునిగిన, వరద నుంచి తేరుకున్న పత్తి మొక్కలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులలో పూత, పిందె రాలడం, బాగా ముంపులో ఉన్న మొక్కలు వాడిపోవడం గుర్తించామన్నారు. నివారణకు ముంపు నుంచి బయట పడిన మొక్కలకు ఎకరాకు 25-30 కేజీల యూరియా 20 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. పై పాటుగా 2 శాతం యూరియా, 1 శాతం కేఎన్‌వోను పిచికారీ చేసుకోవాలని సూచించారు. పూత, పిందె రాలకుండా ప్లానోఫిక్స్ లేదా బోరాన్ 1 కేజీ లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. తెగుళ్ళు వ్యాపించకుండా సీవోసీ 600 గ్రాములు ఎకరాకు, కార్బండిజమ్, మాంకోజబ్ 2.5 గ్రామ లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీ రంజని, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.



పెదపరిమిలో నీటమునిగిన పత్తి మొక్కలను పరిశీలిస్తున్న లాంఫాం శాస్త్రవేత్తలు

'కృష్ణమ్మ' కోపం.. 'కృష్ణయ్య' సాయం!



ఉండవల్లి అమరావతి కరకట్ట వెంట ఇస్కాన్ టెంపుల్‌లోకి వచ్చిన వరద నీరు



విజయవాడలో ఆహార పొట్లాలు పంచదానికి వెళుతున్న ఇస్కాన్ టెంపుల్ సేవకులు

● వరద బాధితులకు మూడురోజులుగా ఆహారం తయారీ
● మానవత్వం చాటుకున్న ఇస్కాన్ టెంపుల్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: అమరావతి కరకట్ట వెంట ఉండవల్లిలో ఉన్న విజయవాడ ఇస్కాన్ టెంపుల్ కృష్ణా నది వరదకు మునిగిపోయింది. అయినా వెనుకాడకుండా ఇక్కడి సేవకులు సహాయక చర్యల్లో పాలు పంచుకుంటున్నారు. తమ మానవత్వాన్ని చాటుకుంటూ మంగళవారం కూడా సేవలు చేశారు. ఈ టెంపుల్‌లో 8 అడుగుల మేర వరద నీరు చేరింది. రాధా శ్యామ్ సుందర్ విగ్రహాలను ముంచెత్తినా ఎట్టి పరిస్థితుల్లోనూ బాధల్లో ఉన్న వారికి ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు కదిలారు. విజయవాడలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో కరకట్టపైనే ఆహారాన్ని తయారు చేశారు. అక్కడి నుంచి విజయవాడ శ్రీ జగన్నాథ మందిరానికి చేర్చి... తర్వాత పలు ప్రాంతాలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశామని ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు శ్యామ్ సుందర్ అచ్యుత దాస్ తెలిపారు.

కృష్ణానదిలోకి దూకిన వివాహిత

● అప్రమత్తమైన పోలీసులు
● మత్స్యకారుల సాయంతో కాపాడిన వైనం
● కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిరూరల్: పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఓ వివాహిత తాడేపల్లి పరిధిలోని కనకదుర్గ వారధిపై నుంచి ఒక్కసారిగా కృష్ణానదిలోకి దూకింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ హఠాత్పరిణామానికి అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారుల సాయంతో ఆమెను కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం చిలకలూరిపేటకు చెందిన పసుపులేటి విజయ, శ్రావణ్‌కు ఐదేళ్ల క్రితం పెళ్లయింది. భర్తతో గొడవల వల్ల విజయవాడలో ఉన్న తమ్ముడు రమణ వద్దకు విజయ వచ్చింది. తమ్ముడు అక్కకు సర్దిచెప్పి తెనాలిలో ఉన్న తల్లి వద్దకు ద్విచక్రవాహనంపై మేనల్లుడితో కలిసి తీసుకువెళ్తుండగా కృష్ణానది వరదను చూస్తానని చెప్పి కనకదుర్గ వారధిపై విజయ ద్విచక్ర వాహనం దిగింది. రమణ వారించేలోగా కృష్ణానదిలోకి దూకింది. దీంతో అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రహీమ్ అప్రమత్తమై మణిపాల్ హాస్పిటల్ వద్ద విధుల్లో ఉన్న మంగళగిరి టౌన్ ఎస్ఐ నారాయణకు సమాచారం ఇచ్చారు. మరో యువకుడితో కలిసి నదిలోకి దిగి వివాహితను కాపాడేందుకు యత్నించినా ప్రవాహ వేగానికి విజయ మూడు కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయింది. దీంతో ఎస్ఐ నారాయణ నదిలో ఉన్న మత్స్యకారులను అప్రమత్తం చేసి పడవల్లో వెళ్లి విజయను కాపాడారు. ఆమెను పడవలోకి ఎక్కించారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితికి చేరడంతో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



బోటులో విజయను బయటకు తీసుకువస్తున్న మత్స్యకారులు, స్థానికులు



చికిత్స పొందుతున్న పసుపులేటి విజయ

అధికారుల అప్రమత్తతతో తప్పిన పెనుముప్పు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు ప్రాంతంలో పెను ప్రమాదాన్ని నివారించడంలో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. సేకరించిన వివరాల ప్రకారం.. కృష్ణానది ఉగ్ర రూపం దాల్చి వరద నీరు కరకట్టకు 5 అడుగుల వరకు వచ్చి చేరింది. రైల్వే ట్రాక్ పక్కన ఇటీవల కొత్త ట్రాక్ కోసం 10 అడుగుల దూరం కరకట్టను తొలగించారు. స్థానికుల సమాచారం అందించడంతో డీఈ కృష్ణారెడ్డి ఈ విషయాన్ని కమిషనర్ అలీం బాషాకు చెప్పారు. స్థానికుల సహకారంతో ఇసుక బస్తాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం రెండువైపులా మట్టి పోయించారు. దీంతో వరద నీరు కరకట్ట దాటి ఇవతలకు రాలేదు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని వారు గుర్తించకపోతే మహానాడుతోపాటు పట్టాభిరామయ్య కాలనీ, ఎన్టీఆర్ కరకట్ట వెంబడి వరదనీరు వచ్చి భారీ నష్టం వాటిల్లేదని స్థానికులు తెలిపారు.

ప్రకాశం బ్యారేజ్‌ను పరిశీలించిన సీపీఐ నాయకులు



బ్యారేజీను పరిశీలిస్తున్న కె.రామకృష్ణ, ఎం.నాగేశ్వరరావు తదితరులు

తాడేపల్లి రూరల్: వరద ఉధృతి కారణంగా పడవలు వచ్చి ప్రకాశం బ్యారేజ్ గేట్లను ఢీకొన్న విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మంగళవారం ప్రకాశం బ్యారేజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.రామకృష్ణ మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. భారీ వర్షాలు కురవబోతున్నాయని స్పష్టంగా వాతావరణ శాఖ ప్రకటించిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని గుర్తుచేశారు. అల్మట్టి డ్యామ్ మొదలు ప్రకాశం బ్యారేజ్ వరకు అన్ని ప్రాజెక్టులలో వరద నీరు ఎక్కువగా ఉన్నప్పుడు ఈ భారీ వర్ష సూచనతో అధికారులు ఎందుకు అప్రమత్తం కాలేదని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో నాలాలు, చెరువులు కబ్జాలు చేసిన వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తగిన చర్యలు తీసుకోవాలని, ఏపీలో కూడా హైడ్రా తరహా సంస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రకాశం బ్యారేజీపై భారీ వాహనాల రాకపోకలను సుమారు 15 సంవత్సరాల క్రితం నిషేధించారని గుర్తుచేశారు. గుంటూరు ప్రాంతం నుంచి విజయవాడకు వెళ్లాల్సిన వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గజవల్లి వెంకట కృష్ణారావు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

తెనాలిరూరల్: బీటెక్‌విద్యార్థిని అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన యువతి ప్రియ బుడంపాడులో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుండి సమీపంలోని షాప్‌కు వెళ్లి వస్తా అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.